క్లుప్తంగా

దూర విద్యపై ముగిసిన వర్క్‌షాప్

తిరుపతి సిటీ: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన వర్క్ షాప్ శనివారం ముగిసింది. ఇగ్నో ప్రొఫెసర్ సీఆర్‌కే మూర్తి దూర విద్య ద్వారా అందిస్తున్న కోర్సులు, ఆన్‌లైన్ పద్ధతిలో కోర్సుల నిర్వహణపై అధ్యాపకులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్‌షాపులో ప్రొఫెసర్లు అరుణ, శైలేశ్వరి, మాధవి, బేబి ప్రసూన, వివిధ శాఖలకు చెందిన 50 అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న లిటిజల్ ఏంజెల్స్ స్కూల్ డైరెక్టర్ శ్వేతరెడ్డి

తిరుపతి కల్చరల్: నగరంలో గత 42 ఏళ్లుగా ఉత్తమ విద్యనందిస్తూ విద్యార్థుల ఉజ్వల భవితకు కృషి చేస్తున్న లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్‌కు బ్రెయిన్‌ఫీడ్ ఆర్గనైజేషన్ వారి స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో లిటిల్ ఏంజెల్స్ విద్యాసంస్థల డైరెక్టర్ కేఆర్ శ్వేతరెడ్డి స్కూల్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. తాము అందించిన సమష్టి కృషి ఫలితంగానే నేడు ఈ అవార్డు అందుకున్నామని ఆమె తెలిపారు. స్కూల్‌కు అవార్డు రావడంపై పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, బద్వేల్ ఎమ్మెల్యే సుధా, సినీ నటుడు శివాజీ రాజా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

తిరుపతి అర్బన్: ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నామని జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పామ్ ఆయిల్, నిమ్మ, మామిడి, తీగజాతి పంటల సాగుకు 50 శాతం వరకు రాయితీలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మొక్కలు, విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, షెడ్ల ఏర్పాటు తదితరాలకు సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు. ఆయా ప్రాంతాల సచివాలయాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్, మండల ఉద్యానశాఖ అధికారిని రైతులు సంప్రదించాలని సూచించారు.

రేషన్‌డీలర్‌కు తుడా చైర్మన్ నివాళి



పాకాల: మండలంలో మాజీ సర్పంచ్ ధనమ్మ భర్త, డీలర్ లోకనాథం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మద్దినాయన పల్లి పంచాయతీలోని కోనెబోయెనిల్లు గ్రామానికి చేరుకున్నారు. పూలమాల వేసి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు

పాపులర్ షూమార్ట్ ప్రారంభం



పాపులర్ షూ మార్ట్‌ను ప్రారంభిస్తున్న మబ్బు దేవనారాయణరెడ్డి

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులో డీ మార్ట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన పాపులర్ షూ మార్ట్‌ను శనివారం మబ్బు దేవనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాపులర్ షూ మార్ట్ అధినేతలు చుక్కపల్లి అరుణ్‌కుమార్, రాకేష్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో 157వ షోరూం ప్రారంభించడం సంతోషకరమన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా రెండు రోజులు కొనుగోలు చేసిన అన్ని జతలపై 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాపులర్ షూ మార్ట్ పార్ట్‌నర్స్ అవినాష్, ఉన్నం మహేష్, అపర్ణ పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ వెలుగులు

- పల్లెల్లో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి జేజేలు పలికిన యువత
- శివార్లలో ఎదురేగి స్వాగతం పలికిన గ్రామస్తులు
- కర్పూర హారతులతో సాదర స్వాగతం



సంక్షేమ లబ్ధిని వృద్ధురాలికి వివరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: జగనన్న ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమ పథకాలు గడప గడపలో వెలుగులు నింపాయి.. పల్లె ప్రజలు అడగకుండానే అన్నీ చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి బిడ్డ మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తామని మాట ఇచ్చారు. మండల పరిధిలోని కల్‌రోడ్డుపల్లి పంచాయతీ మొరవపల్లి, ఎగువ కాశిపెంట్ల, దిగువ కాశిపెంట్ల, తోపులపల్లి, మొరవపల్లి బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డితో కలసి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల జాబితాను లబ్ధిదారులకు అందజేసి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గడపలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి కర్పూర హారతులు పట్టిన మహిళలు సాదరంగా ఆహ్వానించి, ఆత్మీయతను పంచుతూ తమ కష్టాలు పంచుకున్నారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి డప్పుల మోత మోగిస్తూ పండుగ వాతావరణం తీసుకు వచ్చారు.

సమస్యలు సత్వర పరిష్కారం

గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ, మరో వైపు సమస్యలను సత్వర పరిష్కారంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి చొరవ చూపారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఇళ్ల మంజూరు, పింఛను తదితర సమస్యలను ఆయన అధికారులతో మాట్లాడి, పరిష్కరించడంతో ప్రజలు చెవిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటామంటూ ధన్యవాదాలు తెలిపారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. చంద్రగిరిని మరింతగా అభివృద్ధి చేసుకోవాలంటే సీఎం జగనన్నను గెలిపించుకోవాలని, అందిరికి అందుబాటులో ఉంటే తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డినిఇ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆయన కోరారు. జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ బాలాజీ నాయక్, ఎంపీటీసీ సులోచన, మోహన్, రవి, మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, నాయకులు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పసల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో ఆత్మీయత పంచుతూ....



గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి, నాయకులు

తిరుపతి రూరల్: ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పంచాయతీల్లో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ... అవసరమైన పనులను గుర్తిస్తూ పద్మావతిపురంలో రెండో రోజు ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పాదయాత్ర కొనసాగించారు. గడప గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురం పంచాయతీ పరిధిలో రెండో రోజు శనివారం గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపలో మహిళలు జగనన్న ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నామని, తాము అడగకనే అన్నీ ఇస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డిపై సానుకూలత వ్యక్తం చేయగా వచ్చే ఎన్నికల్లో తమ బిడ్డ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించాలని చెవిరెడ్డి లక్ష్మి అభ్యర్థించారు. గుమ్మం ముందుకు వచ్చిన చెవిరెడ్డి లక్ష్మికి జనం ఆత్మీయతను ప్రదర్శిస్తూ హారతులతో స్వాగతం పలికారు. ప్రతి వీధిలో మహిళలు చెవిరెడ్డి లక్ష్మికి ఎదురేగి పూలతో సాదర స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, ఉపసర్పంచ్ రాజ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ గణపతినాయుడు, రాజేంద్ర, లోకేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన



ఈవీఎంలను పరిశీలిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎంలను శనివారం మేయర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. ఈవీఎంల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు ఎలా వినియోగించుకోవాలి, తమకు నచ్చిన గుర్తుపై వేసి ఓటు పోలైందా లేదా ఎలా గుర్తించాలి అనే అంశాలతో పాటు ఈవీఎంలపై పూర్తి అవగాహన కల్పించడం శుభపరిణామమన్నారు. ఈ మేరకు వారం రోజుల పాటు అవగాహన కల్పిస్తామని అన్నారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అపోహలను తొలగించుకోవాలి కోరారు.

దాతల ఔదార్యం.. దళితవాడకు సౌకర్యం



కుప్పిరెడ్డిపాళ్యం నుంచి దళితవాడకు శరవేగంగా వేస్తున్న సీసీ రోడ్డు

చంద్రగిరి: దారి సమస్య పరిష్కారానికి దాతలు ముందుకు రావడంతో దళితవాడకు సౌకర్యవంతమైన రోడ్డు మార్గం ఏర్పడుతోంది. దీంతో దళిత కాలనీ ప్రజలు స్థానిక సర్పంచ్‌తోపాటు నేతలకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. అగరాల పంచాయతీ పరిధిలోని కుప్పిరెడ్డిపాళ్యం దళితవాడలో 40కుటుంబాలకు పైగా జీవనం సాగిస్తున్నారు. వీరికి తరతరాలుగా రోడ్డు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతూ వచ్చారు. దీంతో స్థానిక సర్పంచ్ అగరాల భాస్కర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి సూచనలతో దారి ఏర్పాటుకు కావాల్సిన స్థలం కోసం, దివంగత తూకాకుల రాజారెడ్డి కుటుంబంతోపాటు స్థానిక రైతు తూకాకుల చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబాలతో చర్చించారు. దీంతో రైతులు దళితవాడకు కావాల్సిన రోడ్డు కోసం తన పట్టాభూమిలోని రూ.15లక్షల విలువైన 2.5 సెంట్ల భూమిని ఉచితంగా అందించారు. సమస్య పరిష్కారం కావడంతోపాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహకారంతో తుడా నిధుల నుంచి సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులను కేటాయించారు. శనివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. నాగేశ్వర రావు రెడ్డి, మునిరాజారెడ్డి, పఠాన్ అక్బర్, లక్షణా చారి, సోము, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

చంద్రగిరి: చిల్లర దుకాణాల్లో మద్యం సేవించేందుకు అనుమతిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఐతేపల్లిలోని ఓ దుకాణంలో గత కొంత కాలంగా స్థానికులతో మద్యం తాగిస్తూ వ్యాపారం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో శనివారం సీఐ రాజశేఖర్ దాడులు చేపట్టారు. దుకాణంలో మద్యం సేవిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అనంతరం మందుబాబును స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలతో పాటు దుకాణాల్లో మద్యం తాగిపించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఈ మేరకు మందుబాబుతోపాటు దుకాణదారుడిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడైనా బహిరంగ ప్రదేశాలతోపాటు దుకాణాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

వేడుకగా శ్రీనాగాలమ్మ బాలాలయ పూజలు



ప్రత్యేక పూజల్లో శివశంకర్ రెడ్డి దంపతులు

చంద్రగిరి: జాతీయ రహదారి సమీపంలోని శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి అతిపురాతనమైన శ్రీనాగాలమ్మ ఆలయ జీర్ణోద్ధారణ బాలాలయ ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకుడు ఒంటి శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, రక్షాబంధనం, ప్రాయశ్చితపూజ, ప్రాయశ్చిత హోమం నిర్వహించారు. అనంతరం మూలవర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, బాలాలయం చేపట్టారు. ఆలయ నిర్వాహకుడు ఒంటి శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ వందల ఏళ్ల నాటి అతిపురాతనమైన శ్రీనాగాలమ్మ ఆలయ జీర్ణోద్ధారణ పనులకు పూనుకున్నామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చొరవతో ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

జీవన ప్రమాణాలు పెంపుదలే మోదీ లక్ష్యం

తిరుపతి(అలిపిరి): దేశంలోని నిరుపేదల జీవన ప్రమాణాలను పెంపొందించడం... వారికి ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పనిచేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ముని సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం జీవకోనలోని గురుకృప పాఠశాలలో వికసిత భారత్ సంకల్ప యాత్రపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ మహిళలు, వివిధ చేతి వృత్తుల వారు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఉజ్వల స్కీమ్ కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ నోడల్ ఆఫీసర్ రవికుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, ఓబీసీ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జల్లి మధుసూదన్ పాల్గొన్నారు.

యువత నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి



పట్టభద్రులతో ఎస్వీయూ డీన్ విజయ్ భాస్కర్‌రావు, ప్రిన్సిపల్ నిరంజన్‌బాబు తదితరులు

రామచంద్రాపురం: యువత నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని ఎస్వీయూ రీసెర్చ్, డెవలప్‌మెంట్ డీన్ విజయ్ భాస్కర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్ ఫార్మసీ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్‌బాబు, కరస్పాండెంట్ సుమలత మాట్లాడుతూ విద్యార్థులు సమాజ అభివృద్ధి కృషి చేయాలన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్‌తోపాటు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి ఘన నివాళి



షేక్ సాబ్జీకి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకు ఉపాధ్యాయ సంఘాల నేతలు నివాళులర్పించారు. శనివారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. ఉపాధ్యాయ లోకానికి ఆయన చేసిన సేవలు, ఉద్యమాలు, ఆయన కుటుంబ నేపథ్యాన్ని వివరించారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులను సాక్షాత్కరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి, శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండుగా నిర్వహించారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, సూపరింటెండెంట్ వెంకటస్వామి పాల్గొన్నారు.

కొండపై మంచు ఇక్కట్లు



తిరుమలగిరులపై పొగమంచు పరచుకోవడంతో భక్తులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రోజంతా మంచు తెరలు కమ్ముకున్నాయి. దీంతో ఘాట్ రోడ్లు, ఆలయం ముందు ప్రాంతాలు, మాడ వీధుల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంది. దీంతో రహదారులు కనిపించక వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. వాహనాలు కనిపించక పాదచారులు అవస్థల పాలయ్యారు. – తిరుమల



రోడ్లపై వాహనాలకు దారి చూపుతున్న ట్రాఫిక్ పోలీస్



మంచు దుప్పటిలో రహదారి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల అధికారులు పంచాయతీల్లో పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డుల మంజూరుపై సచివాలయ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇంటి నిర్మాణ బిల్లులు లబ్ధిదారులకు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులు ట్యాబులను సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఎంఈఓలకు సూచించారు. సెరికల్చర్ ఏఈ సునీల్ మాట్లాడుతూ మండలం పామాయిల్ సాగుకు ఎంపికైనట్లు చెప్పారు. ప్రభుత్వం సబ్సిడీతో పామాయిల్ మొక్కలను అందిస్తుందని పేర్కొన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, తహశీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌రాజు, ఏపీఓ హంసవేణి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి ఫిలిం ఫెస్టివల్ అవార్డులు ప్రదానం

తిరుపతి కల్చరల్: ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్, యునైటెడ్ ఫిలిమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో 2024 ఫిబ్రవరి 4వ తేదీన తిరుపతి మహతి ఆడిటోరియంలో తిరుపతి ఫిలిం ఫెస్టివల్ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఇండియన్ ఫిలిం మేయర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు పి.రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తెలుగు సినిమా నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సినిమా రంగంలో 24 విభాగాలకు చెందిన వారు సినిమాలు, వెబ్ సిరీస్, షార్ట్ ఫిలింలను ఫిబ్రవరి 1వ తేదీలోపు పంపించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఐఎఫ్‌ఎంఏ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ కర్ణాటక సహాయ కార్యదర్శి దిలీప్‌కుమార్, ఆనందరావు, క్రిస్టోఫర్, మురళీమోహన్, పి.జీవన పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసమే మంత్రి పెద్దిరెడ్డిపై విమర్శలు

తిరుపతి కల్చరల్: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక పసలేని విమర్శలు చేస్తూ బీసీవై నేత రామచంద్ర యాదవ్ తన రాజకీయ ఉనికి చాటుకునే ప్రయత్నానికి పాల్పడుతున్నారని వైఎస్‌ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఏనాడు రైతుల గురించి ప్రస్తావించని ఆయన ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేందుకు దిగజారుడు రాజకీయాలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. సీఎం జగనన్న పాలన నేపథ్యంలో వరుణుడి కరుణతో చిత్తూరు జిల్లాలో వర్షాభావంతో రైతులు వ్యవసాయంతో ఎంతో సుభిక్షంగా ఉన్నారని పేర్కొన్నారు. ఉన్నపళంగా సదుం పర్యటనలో ఆయన శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ రైతుల్లో చిచ్చుపెట్టే విధంగా వ్యాఖ్యానిస్తూ విమర్శలు గుప్పించడం సిగ్గుచేటని తెలిపారు. రైతు కుటుంబంలో పుట్టి ఆ రైతు కష్టాలు తెలిసిన వ్యక్తిగా రైతులకు బాసటగా నిలిచిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై రైతుల ముసుగులో విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే మంత్రి పెద్దిరెడ్డి విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని, తగిన గుణపాఠం చెబుతాం ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు.

డిగ్రీ చివరి సెమిస్టర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



ఒప్పందం చేసుకుంటున్న ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యం

తిరుపతి కల్చరల్: కోడె బ్రిడ్జి మెడికల్ కోడింగ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చివరి సెమిస్టర్ చదివే విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం అవకాశాలు లభించనున్నాయి. ఈ మేరకు ఎస్వీ ఆర్ట్స్ కళాశాలతో కోడె బ్రిడ్జి మెడికల్ కోడింగ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఇనిస్టిట్యూట్ యాజమాన్యం శనివారం ఎంఓయూ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఇంటర్న్‌షిప్‌తో మెడికల్ కోడింగ్, మెడికల్ బిల్లింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సేల్స్ ఫోర్స్, లాంగ్వేజెస్, పైథాన్, జావా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సులను అందించనుంది. ఒప్పందం కుదుర్చుకోవడానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ, వైస్ ప్రిన్సిపల్ బి.సత్యనారాయణ, నోడల్ ఆఫీసర్స్ కిరణ్‌కుమార్ రాజు, మోహన మూర్తికి కోడె బ్రిడ్జి యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

యువతరం ఓట్లు ప్రగతికి మెట్లు



అవగాహన కల్పిస్తున్న ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత

తిరుపతి సిటీ: యువతరం ఓట్లు ప్రగతికి మెట్లు అని, 18 ఏళ్ల వయస్సు నిండిన యువత బాధ్యతగా ఓటు హక్కును పొందాలని తిరుపతి నియోజకవర్గం ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత పిలుపునిచ్చారు. స్థానిక న్యూబాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఓటర్ల నమోదు, ఓటింగ్ ప్రకియ, ఓటింగ్ విధి విధానాలపై ఎన్నికల కమిషన్ రూపొందించిన స్వీప్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఫారం-6ను, ఇప్పటికే బయట ప్రాంతాల్లో ఓటు ఉండి ప్రస్తుతం నివాసముంటున్న ప్రాంతానికి మార్చుకోదలచిన వారు ఫారం-8 దరఖాస్తులను ఉపయోగించుకోవాలని సూచించారు. అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ, డిప్యూటీ తహశీల్దార్ జీవన్ పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తికి గాయాలు



మతిస్థిమితం లేని వ్యక్తి

తిరుమల: ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిన సంఘటన శనివారం రాత్రి తిరుమలలో చోటు చేసుకుంది. స్థానికులు, విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. 45 ఏళ్ల వయస్సు కలిగిన ఓ వ్యక్తి కడుపుభాగంలో, మోకాళ్లపై రక్తగాయాలతో తిరుమలలోని పీఏసీ2 వద్ద ఉండడాన్ని స్థానికుల గుర్తించారు. అధికారులకు సమాచారం అందించగా వారు తీవ్ర రక్త గాయాలైన వ్యక్తిని తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాలు ఆరా తీయగా విజయనగరానికి చెందిన గోవిందరావుగా తెలిసింది. ఊరు పేరు మాత్రమే చెప్పి, తనకేం గుర్తు లేదని తెలిపాడు. తలనీలాలు సమర్పించిన అనంతరం మతిస్థిమితం కోల్పోయి పరుగులు తీయడంతో కింద పడిపోయి గాయపడి ఉండొచ్చని విజిలెన్స్ అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఎవరో హత్యాయత్నానికి పాల్పడ్డారని, అందుకే కడుపులో ఎవరో పొడిచినట్లు గాయాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. దీనిపై తిరుమల టూ టౌన్ పోలీసులు విచారణ ప్రారంభించి సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.